గస్తీ బృందం

సంపత్

విశాలమయిన హిందు మహాజలాలలో నిశ్శబ్దంగా దూసుకు పోతోంది వార్ షిప్. తలుపు తెరుచుకొని డెక్ పైకి వచ్చాడు కెప్టెన్ నటరాజన్. అతని వయస్సు దాదాపు నలభై సంవత్సరాలుంటుంది. మనిషి దృఢంగా, ఆరోగ్యంగా వుంటాడు. చురుకయిన కళ్లు పొడవయిన ముఖం, మంచి ఎత్తు.

తూర్పున ఆకాశంలో భూమి, ఆకాశం కల్సినట్లు కన్పించేచోట ఎర్రగా కాంతివంతం అయింది. సూర్యుడు యింకా రాలేదు పైకి.

ఆ సూర్యోదయ దృశ్యం అంటే నటరాజన్ కి చాలా యిష్టం. ఎన్నిపనులున్నా ఆ సమయానికి డెక్ మీదకు

చేరుకుంటాడు. ఎన్ని సంవత్సరాలనుంచి ఆ దృశ్యం చూస్తున్నా ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటూంది అతడికి.

హిందూమహాసముద్ర జలాలలో కొన్ని అగ్రరాజ్యాల నౌకా సంచలనం ప్రారంభ మవటం భారతదేశం గమనించింది. తన జలాలను సంరక్షించుకోకపోతే విపరీత పరిణామాలు సంభవిస్తాయని గుర్తించింది. ఫలితంగా "జలరక్షక్" అనే ఆ నౌక హిందూ మహాసముద్రంలో గస్తీకై ఏర్పాటు గావించబడింది.

ఆధునిక ఆయుధాలన్నీ ఆ నౌకలో అమర్చబడ్డాయి. ఆ నౌకలోని సిబ్బంది అంతా సుశిక్షితులు, విశ్వాసపాత్రులూను.

డెక్ మీద నిలబడి రెయిలింగ్స్ మీద చేతులాన్చి, సూర్యోదయాన్ని తదేకంగా చూస్తున్నాడు కెప్టెన్ నటరాజన్. అతను తెలుగువాడయినా, దక్షిణం వాడంటే, మద్రాసీ కిందే లెక్క కాబట్టి నటరాజు కాస్తా నటరాజన్ అయిపోయింది.

తూర్పున పైకి వస్తున్న సూర్యబింబాన్ని చూస్తున్న నటరాజన్ తనని ఎవరో పల్కరించడంతో ఈ లోకంలోకి వచ్చాడు.

వైర్‌లెస్ రూంనుండి వచ్చాడతను. ఏదో మెసేజ్ వచ్చింది. నటరాజన్ కదలబోతూ సూర్యబింబాన్ని చూసి కళ్ళు చిట్లించాడు. ఒకనిమిషం అలానే చూసి వెళ్ళి ఏదో మాట్లాడాడు. మగల పైకివచ్చి చూడసాగాడు. అప్పటికే సూర్యుడు చాలా పైకివచ్చాడు.

దిగంతంలో రెండు, మూడు నలుసులు కన్పిస్తున్నాయి. అవేమిటో తెల్సు నటరాజన్‌కి.

విమానాలు! బహుశా యుద్ధవిమానాలు కాకపోవచ్చు. తమ ఉనికి తెల్సుకునేందుకు పంపబడ్డ స్కౌట్ ఫ్లైట్స్ అయివుంటాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశాడు.

బైనాక్యులర్స్‌తో డెక్ మీద నిలబడి ఆ విమానాల వంక దృష్టి సారించాడు. క్రమంగా అవి దగ్గరవుతున్నాయి.

అరగంట తర్వాత అవి బాగా దగ్గరయాయి.

చాలా చిన్న విమానాలు. మన 'నాట్' విమానాలంత వున్నాయి.

విమానాలు జలరక్షక్‌ని సమీపించాయి. వాటిమీద ఏ విధమయిన గుర్తులూ లేవు. రివ్వున తలమీదుగా దూసుకు పోయాయి. మొత్తం మూడు విమానాలు. అలానే ముందుకు వెళ్ళి వెనక్కు తిరిగాయి. వాటిని స్మాష్ చేయడం చాలా తేలిక. కాని అనవసరంగా విరోధం తెచ్చుకోవడం యిష్టంలేదు. మరో మూడునాలుగు చక్కర్లు కొట్టి, తిరిగి తూర్పుగా ఎగిరి వెళ్ళిపోయాయి.

ఏదో ప్రమాదం ముంచుకు రాబోతున్నదని హెచ్చరించింది నటరాజన్ మనస్సు. ఐనా నిబ్బరంగానే వున్నాడు.

మరో అరగంట తర్వాత కెప్టెన్ నటరాజన్‌కి మరో వార్త తెలియజేయబడింది.

గుర్తుతెలియని సబ్-మెరీన్ ఒకటి సింగపూర్ దాపుల్లో కన్పించింది. అది సౌత్-వెస్ట్ డైరెక్షన్‌లో ప్రయాణిస్తూందని, బహుశా దానివల్ల జలరక్షక్‌కి ఏదయిన ఆపద సంభవించవచ్చునని భావించబడుతూంది. ఒకవేళ ఏదయినా ప్రమాదం వాటిల్లితే దానిని పూర్తిగా స్మాష్ చేయాల్సిందని వార్త వచ్చింది.

ఆ వార్త విని నటరాజన్ ఎంతో సంతోషించాడు.

భారత దేశం శాంతి, శాంతి అని కలవరిస్తూంటే దాన్ని అలుసుగా తీసుకొని చేతకానితనం క్రింద జమకట్టిన దేశాలకు కనువిప్పు కలుగుతూంది. భారత దేశంకూడా శక్తి కలదేనని గ్రహిస్తాయి.

అందుకే ఈ ఆనందం నటరాజన్‌కి.

రెండురోజులు గడిచిపోయాయి మామూలుగా. సబ్-మెరిన్ జాడ లేదు. అయితే కెప్టెన్ నటరాజన్ ఊహించని మరొక ప్రమాదం ముంచుకొచ్చింది.

2

దాదాపు పదకొండు గంటల ప్రాంతంలో తూర్పు నుంచి ప్రత్యక్షమయాయి జెట్ ఫైటర్స్. దాదాపు వంద పైగానే వుంటాయి. వాటిని చూస్తుంటే తను చూసిన రెండో ప్రపంచయుద్ధం నాటి ఇంగ్లీష్ పిక్చర్స్ గుర్తొచ్చాయి. మరల మూడో ప్రపంచ యుద్ధం రాబోతూందా?

వైర్‌లెస్‌లో మాట్లాడి, తన సిబ్బందికి ఆర్డర్స్ యిచ్చాడు. శత్రువులు యింతకు తెగిస్తారని భావించలేదతను. ఏ విధమైన గుర్తులేకుండా మీదపడి స్మాష్ చేసి వెళ్ళిపోవాలని వాటి ఉద్దేశ్యం.

వెంటనే షిప్‌ను వెనక్కు తిప్పమని, సహాయంగా కొన్ని వార్ ప్లేన్స్ బయలుదేరాలని మెసేజ్ వచ్చింది.

పన్నెండు గంటల ప్రాంతంలో దాడి ప్రారంభమైంది 'జలరక్షక్' మీద.

రివ్వున ఎగురుతున్నాయి బాంబర్స్. వాటి అడుగునుంచి దూసుకువస్తున్నాయి బాంబులు. రివ్వున పోయి టార్గెట్ కు

తగులుతున్నాయి. ఊపిరి పీల్చుకొనే వ్యవధికూడా లేకుండా పోయింది 'జలరక్షక్' సిబ్బందికి. డెక్ మీద అమర్చబడ్డ ఫిరంగులు, మెషినుగన్ లు, యింకా యితర ఆయుధాలు ఉపయోగించసాగారు.

కొన్ని విమానాలు కూలిపోతున్నాయి. కొన్ని విమానాలనుంచి వెలువడిన బాంబులు షిప్ మీద పడి పెద్ద శబ్దంతో పేలిపోతున్నాయి. తుత్తునియలైపోతోంది నౌక అంతా. ఐనా ఎదుర్కొంటున్నారు జలరక్షక్ సిబ్బంది.

దాదాపు ఇరవై విమానాలు ధ్వంసం అయిపోయాయి. కంట్రోలు రూంలోనుండి మెసేజ్ పంపుతూ, తన సిబ్బందికి అవసరమైన ఆజ్ఞలను యిస్తున్నాడు కెప్టెన్ నటరాజన్. వార్ ప్లేన్స్ బయలుదేరాయని అధికారులు చెబుతూనే వున్నారు.

ఉన్నట్లుండి పైన ఏదో బాంబు పడటంతో రూం అంతా అదిరిపోయింది రెండు క్షణాలు. అందరూ అటూ యిటూ పరుగెత్తారు ప్రాణభయంతో కర్తవ్యం మర్చిపోయి.

మరో బాంబు పడింది. రివ్వున బయటకువచ్చాడు కెప్టెన్ నటరాజన్. డెక్ మీదకు చేరుకున్నాడు. డెక్ అంతా ఛిన్నాభిన్నం ఐపోయింది. మంటలు అంటుకొని భయంకరంగా ప్రజ్వరిల్లుతూ ఏ క్షణంలో అయినా షిప్ అంతా పేలిపోయేటట్లుంది.

చాలామంది సిబ్బంది చనిపోయారు. కొంతమందిని అసలు గుర్తుపట్టలేం. కొందరికి తలలు లేవు. చేతులు, కాళ్లు తెగి పడివున్నారు కొంతమంది. డెక్ పైనున్న యుద్ధ పరికరాలవైపు గురిచూసి కొట్టటంవల్ల నిరుపయోగం ఐపోయాయి అవి.

రివ్వున ఒక విమానం దూసుకురావటంతో ఎగిరి ప్రక్కకు దూకి బోర్లాపడిపోయాడు కెప్టెన్ నటరాజన్. దానినుంచి వెలువడ్డ బాంబు ముందుకు దూసుకుపోయి కంట్రోలు రూంపై బడింది. షిప్ అంతా మరోమారు దద్దరిల్లి పోయింది. షిప్ అంతా మంటలు వ్యాపించాయి.

తమకు సహాయంగా రావల్సిన విమానాలు యింకా చేరుకోలేదు. ఒకవేళ వచ్చినా జలరక్షక్‌ని రక్షించడం దుర్లభం. షిప్ మీద మంటలు అంటుకోవడంవల్ల షిప్‌లోని ప్రేలుడు పదార్థాలు అంటుకొని ప్రేలుతున్నాయి. కొంతమంది సిబ్బంది రానున్న ఆపద గ్రహించి సముద్రంలోకి దూకి దూరంగా ఈదుకుపోతున్నారు.

సముద్రంలో కూడా బాంబులను వదులుతున్నాయి విమానాలు. రివ్వున అంతెత్తు ఎగిరిపడుతున్నాయి సముద్రపు నీళ్ళు బాంబు ప్రేలినపుడల్లా. విమానాల మోత, ప్రేలుళ్ళు, మంటల శబ్దం అంతా అయోమయంగా భయంకరంగా వుంది అక్కడి వాతావరణం.

ఒకప్రక్కకు ఒరిగిపోయింది జలరక్షక్. ఇక అది మునిగిపోవటం ఖాయం అని నిర్ణయించుకున్నాడు కెప్టెన్ నటరాజన్.

మరో పావుగంట తర్వాత విమానాలు తిరిగి వెళ్ళిపోయాయి. సద్దు మణిగింది. కెప్టెన్ నటరాజన్ లేచి షిప్ అంతా కలయచూశాడు. అవమానంతో భగ్గుమంది అతని హృదయం. లేచి షిప్ అంతా తిరిగాడు.

కంట్రోలు రూం పూర్తిగా ధ్వంసం అయిపోయింది. వైర్‌లెస్ ఆపరేటర్ ఛార్లెస్ క్రింద పడివున్నాడు. నటరాజన్ అతని నాడి చూశాడు. ఆడుతూంది. మరో ఐదు

నిమిషాల చికిత్స అనంతరం ఛార్లెస్ కోలుకున్నాడు. అదృష్టవశాత్తు అతనికి పెద్ద దెబ్బలేవీ తగల్లేదు. వైర్‌లెస్ సెట్ పూర్తిగా ధ్వంసం అయింది.

ఇంకా ఎవరైనా బ్రతికున్నారేమోనని షిప్ అంతా కలియ తిరిగాడు. అంతా పొగ ఊపిరాడనివ్వకుండా. ఎక్కడివక్కడ విరిగి పడిపోయాయి. కాళ్ళకు తగులు తున్నాయి శరీరాలు. ఆగి చూస్తున్నాడు.

అరగంట గడిచినతర్వాత మొత్తం తన బృందంలో పన్నెండుమంది ప్రాణాలతో డెక్ మీదకు చేరుకున్నారు. వారిలో ఛార్లెస్, మరి యిద్దరు మాత్రం మైనర్ ఇంజ రీస్‌తో బయటపడ్డారు. మిగిలినవాళ్ళకు తీవ్రంగా అయ్యాయి గాయాలు.

నటరాజన్ ఆజ్ఞమీద లైఫ్‌బోట్స్‌ను చూడటానికి వెళ్ళాడు ఛార్లెస్. అన్నీ ధ్వంసం అయిపోయాయి, రెండు తప్ప.

మరో అరగంట తర్వాత లైఫ్‌బోట్లు సముద్రంలో తేలాడుతున్నాయి షిప్‌కు కొద్ది దూరంలో. ఒక లైఫ్ బోట్‌లో నిలబడి నీళ్ళునిండిన కళ్ళతో మునిగిపోతున్న షిప్ వంక చూస్తున్నాడు కెప్టెన్ నటరాజన్.

ఒకప్రక్క పైకె లేచింది షిప్. మంటలు ఇంకా ప్రజ్వ రిల్లుతున్నాయి. ఒకప్రక్కనుండి నీరు ఆక్రమించు కుంటూంది షిప్‌ను. ఆయిల్ పడటంవల్ల సముద్రంలో అక్కడక్కడ మంటలు మండుతున్నాయి. క్రమంగా మునిగిపోతోంది జలరక్షక్.

మరో అయిదునిమిషా లనంతరం పూర్తిగా మునిగి పోయింది షిప్. మరో అయిదునిమిషాలు గడిచాయి. అస లక్కడ జలరక్షక్ అనే నౌక ఉన్నట్లే ఆనవాళ్ళు లేవు.

దీర్ఘంగా నిట్టూర్చాడు కెప్టెన్ నటరాజన్. భారత దేశం దిక్కుగా పోతున్నాయి లైఫ్ బోట్లు.

ఎవరో అరిచారు 'కెప్టెన్' అంటూ. అందరూ అతను చూపించిన దిశవైపు చూసి అవాక్కయి, గుడ్లప్పగించి చూస్తూండిపోయారు.

3

దాదాపు రెండు మూడు వందల అడుగుల దూరంలో సముద్రపు నీళ్ళను దొలుచుకుంటూ లేస్తున్న దొక సబ్-మెరైన్. అక్కడినుండి బయలుదేరిన నీరు అలలు అలలుగా చుట్టూ వ్యాపించి సాగిపోతున్నాయి.

ఒక నిమిషం తర్వాత సబ్-మెరీన్ పైకి తేలింది. దాని కానింగ్ టవర్ స్పష్టంగా కన్పిస్తూంది. ఆకుపచ్చ నలుపు రంగులు కలిసిన రంగుతో ఏ విధమయిన గుర్తులు లేకుండా ఉంది.

తనకు హెచ్చరించబడిన సబ్-మెరైన్ అదేనని గ్రహించాడు కెప్టెన్ నటరాజన్.

"అంటే మనల్ని సబ్-మెరైన్లో వుండేవాళ్ళు గమనిస్తున్నా రన్నమాట!" ఒకడన్నాడు.

"బోట్స్‌ను దూరంగా, స్పీడ్ గా నడపండి!"అన్నాడు ఛార్లెస్.

"వద్దు!" అంతవరకు నిశ్శబ్దంగా వున్న కెప్టెన్ నటరాజన్ గొంతు ఖంగుమంది.

అందరూ ఆశ్చర్యంతో అతని వంక చూశారు.

"మనం యిప్పుడు తప్పించుకోలేము. మనల్ని వెంటాడి నాశనం చేయగల శక్తి వుంది వారికే. వారికి లొంగిపోదాం. వీలయితే దానిని ధ్వంసం చేద్దాం!"

మౌనంగా వుండిపోయారు. మరో నిమిషం అనంతరం కానింగ్ టవర్ మీదకు ఎవరో వచ్చారు. మైక్ ద్వారా ఇంగ్లీషులో విన్పించింది.

"మిస్టర్స్! మా శక్తి సామర్థ్యాలు కళ్ళారా చూశారు. ఇందాక మీ వార్ షిప్ ను నాశనం చేసిన యుద్ధవిమానాలు మావే. మాకు మిమ్మల్ని చంపటం ఇష్టంలేదు. అందుకే మర్యాదగా లొంగిపోండి. అలా చేయకపోతే మిమ్మల్ని నాశనం చేయటం అంత కష్టమేమీ కాదు!"

అందరూ నటరాజన్ వంక చూశారు. బోట్ లను సబ్-మెరీన్ వైపు నడపమంటూ అనుజ్ఞ యిచ్చాడు. శత్రువులకు లొంగిపోవటం కన్న ఆత్మహత్య మేలనే కెప్టెన్ అంతర్యం ఎవరికీ అంతుపట్టలేదు. అతన్ని అర్థం చేసుకున్నవాడు ఛార్లెస్ ఒక్కడే. ప్రతీకారం, పగతో నటరాజన్ హృదయం వుడికిపోతోంది. శత్రువులను ఏ విధంగానైనా స్మాష్ చేయాలని అతని సంకల్పం అని గ్రహించాడు ఛార్లెస్.

బోట్లు సబ్ మెరీన్ వైపు కదిలాయి.

"కెప్టెన్! ఐ అండర్ స్టాండ్ యు!" అన్నాడు ఛార్లెస్. అతనివంక నిర్లిప్తంగా చూశాడు కెప్టెన్ నటరాజన్.

"బహుశా మీకు సహాయంగా రావాల్సిన విమానాలను గురించి ఆలోచిస్తున్నారా? అటువంటి ఆశలు పెట్టుకోకండి. ఇప్పటికే మా జట్ ఫైటర్స్ మీ వాటిని నాశనం చేసి తిరిగి వస్తుంటాయి!"

అందరికీ అర్థం అయింది తమకు ఎందుకు సహాయంగా రాలేదో. సహాయంగా వస్తున్న విమానాలను మధ్య దారిలోనే అటకాయించి వుంటారు.

మరో అరగంట తర్వాత కెప్టెన్ నటరాజన్ బృందం సబ్ మెరీన్‌లో వుంది. అతని సిబ్బందిలో అయిదుగురికి స్పృహ లేదు. వారికి అవసరమైన వైద్య సహాయం, ఇతర ఏర్పాట్లు చూశాడు సబ్ మెరీన్ కెప్టెన్ చింగ్ చూ.

వారి సిబ్బందిని చూడగానే కెప్టెన్ నటరాజన్‌కి వారే దేశస్థులో అర్థం అయిపోయింది. "కైనా." భారత దేశంతో మొదటినుండి కయ్యానికి కాలు దువ్వుతున్న కైనా దేశం.

అందరినీ కాబిన్‌లలో బంధించి బయట తాళాలు వేశారు.

4

నాలుగు రోజులు గడిచిపోయాయి మామూలుగానే.

కెప్టెన్ నటరాజన్ అనుచరులలో గాయపడిన వారిలో యిద్దరు మరణించారు. వారిని సముద్రంలోకి విసిరేశాడు కెప్టెన్ చింగ్ చూ.

నటరాజన్ తనలో తాను వుడికిపోతున్నాడు. ఛార్లెస్‌లో ఏ మార్పూ లేదు. నిర్లిప్తంగా జరిగేది చూస్తూ వున్నాడు.

అయిదోరోజు ఉదయం పదిగంటల ప్రాంతంలో సబ్-మెరైన్ పైకి తేలింది.

కెప్టెన్ చింగ్ చూ స్వయంగా నటరాజన్ బంధింపబడిన కాబిన్ దగ్గరకు వచ్చి దగ్గరుండి తలుపులు తెరిపించాడు. అతని వెనుక మెషిన్‌గన్‌తో యిద్దరు నిలబడి వున్నారు.

"కెప్టెన్! మా కర్తవ్యం నిర్వర్తించాము. మిమ్మల్ని మా పై అధికారులకు అప్పజెప్పబోతున్నాం. దయచేసి ఎటువంటి గొడవా చేయక మా వెంట రండి" అన్నాడు

కెప్టెన్ చింగ్ చూ.

కెప్టెన్ నటరాజన్ ఈ విషయాన్ని ముందే ఊహిం చాడు. తమని చంపకుండా వదలివేయటంలో ఏదో గూడు పుఠాణీ వుందని అనుమానించాడు. బహుశా తమని బందీలుగా పట్టుకొని భారత ప్రభుత్వంతో మంతనాలు సాగించటమో, లేక భారతదేశం తమమీద దాడిచేసిందన్న అపవాదు, తమని సాక్షులుగా చూపి అంతర్జాతీయంగా గొడవ చేయటమో ప్రారంభిస్తారని, భావించాడు నటరాజన్. అది యిప్పుడు నిజమయ్యేటట్లుంది.

సబ్ మెరైన్ నుంచి దించారు బందీలను. అప్పటికే అక్కడ సముద్రంలో రెండు మోటారు బోట్లు తేలుతున్నాయి. వాటిల్లో ముగ్గురేసి వ్యక్తులున్నారు. అందరి చేతుల్లోను మెషిన్ గన్స్ మెరుస్తున్నాయి. ఎటువంటి పిచ్చిపనులు చేసినా కాల్చిపారేస్తారని అర్థం అయింది కెప్టెన్ నటరాజన్ కి.

బోట్స్ బయలుదేరాయి నటరాజన్ బృందాన్ని ఎక్కించుకుని. చుట్టూ చూశాడు. దూరంగా ఏదో దీవి కన్పిస్తూంది.

పావుగంట తర్వాత దగ్గరగా వున్న ఆ దీవిని చేరుకున్నాయి బోట్లు.

ఆ దీవి అంతా చెట్లు, పొదలతో దట్టంగా కమ్ముకొని వుంది. చాలా పెద్దది. కొంచెం దూరంలో అంత ఎత్తులేని చిన్నచిన్న కొండలు కన్పిస్తున్నాయి.

దీవి తీరంనుంచి చిన్న సముద్రపుపాయ ఒకటి దీవిలోకి పోతున్నది. అది మనుషులు చేశారో, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిందో తెలియదుగాని ఆ పాయకి అటూ యిటూ

చెట్లు దట్టంగా అలుముకొని అవతల ఏముందో కన్పించనీయటం లేదు.

బోట్లు ఆ పాయ వెంబడి లోనికి సాగుతున్నాయి. పోనుపోను చుట్టూ ఉన్న అడవి దట్టం అవుతూంది.

దాదాపు అరగంట ప్రయాణం జరిగిన అనంతరం బోట్లు ఆగాయి. అక్కడ పాయ ఒడ్డునే చిన్న ప్లాట్‌ఫామ్‌లా వుంది మనుషులు దిగటానికి వీలుగా. దిగమని హెచ్చరించారు మెషిన్‌గన్స్ పట్టుకున్న వ్యక్తులు. వారి ముఖాలలో కరుకుదనం కనపడుతోంది.

కెప్టెన్ నటరాజన్ ముందుకు నడిచాడు. ఛార్లెస్ మౌనంగా అతన్ని అనుసరించాడు అటూ యిటూ చూస్తూ. అదే ప్రాంతమో అర్థం కాలేదు. బహుశా ఆస్ట్రేలియా దగ్గర ఏదో దీవి అయివుంటుందని అనుకున్నాడు.

చెట్ల మధ్యగా సన్నటి దోవ వుంది. చెట్లు నరికే ఆ దారిని ఏర్పాటు చేశారు. కెప్టెన్ నటరాజన్ ముందు ఇద్దరు వ్యక్తులు నిలబడి టార్చిలైట్లతో ముందుకు సాగుతూ దోవ చూపిస్తున్నారు. చాలా శుభ్రంగా వుంది దోవ.

చెట్ల చాటునుంచి పోతూ, మెలికలు తిరుగుతూ, పైకి ఎక్కుతూ, క్రిందకి దిగుతూ ప్రయాణించి ముప్పావుగంట అనంతరం ఒక బహిరంగ ప్రదేశానికి చేరుకున్నారు నటరాజన్ బృందం. అక్కడ చెట్లనన్నిటిని నరికి చదును చేశారు. వారిముందు చిన్న గుట్ట తప్ప మరేమి కన్పించటం లేదు.

ముందున్న వ్యక్తులు గుట్ట దగ్గరకు పోయి ఒక బండ రాయిని ప్రక్కకు నెట్టి ఏదో చేశారు. మరుక్షణమే ఆ గుట్టలో కొంతభాగం ప్రక్కకు తప్పుకుంది. అందరూ

లోనికి పోగానే తిరిగి మూసేశారు. లోపల లైట్లు వెలుగుతున్నాయి. బోనులాంటి గది ఒకటి వుంది అందులో. అందరూ ఎక్కగానే రివ్వున క్రిందకు బయలుదేరింది.

అండర్ గ్రౌండ్ లో వారి స్థావరం అని గ్రహించాడు నటరాజన్. అయిదు నిమిషాలు ప్రయాణించి ఒకచోట ఆగింది లిఫ్ట్. అక్కడ పట్టపగలులా లైట్లు వెలుగుతున్నాయి. చుట్టూ మెషిన్ గన్స్ ధరించి వున్న మనుషులు కాపలాగా నిలబడి వున్నారు. లిఫ్ట్ ఆగగానే గన్స్ పొజిషన్ లో పట్టుకున్నారు.

నటరాజన్ బృందం వెంట వచ్చినతను వారి నాయకుడి దగ్గరకు వెళ్ళి ఏదో చెప్పాడు. అతడు తల ఊపి, ప్రక్కనున్న స్విచ్ నొక్కాడు. అతని ప్రక్క తలుపు తెరచుకొని మార్గం ఏర్పడింది.

నటరాజన్ బృందాన్ని మరోసారి చెక్ చేసి ఏ విధమయిన ఆయుధాలు లేవని దృఢపరుచుకొని లోనికి పంపుతున్నారు. వాస్తవానికి వారి దగ్గరున్న ఆయుధాలు ఇది వరకే క్లెపెన్ చింగ్ చూ లాక్కున్నాడు. అయినా రొటీన్ ప్రకారం చెక్ చేసి లోనికి వదులుతున్నారు.

లోపల గుండ్రంగా, పొడుగ్గా సొరంగం ఒకటి వుంది. పైభాగాన లైట్లు వెల్గుతుండటంవల్ల మార్గం స్పష్టగా కన్పిస్తూంది. అల్యూమినియంవంటి రేకుతో తయారుచేసినట్లు సొరంగం తళతళా మెరుస్తూ, నున్నగా జారుతోంది. దానికి అటూ యిటూ చిన్నచిన్న రంధ్రాలున్నాయి. బహుశా వాటిల్లో టెలివిజన్ కెమెరాలుండి వుండొచ్చని ఊహించాడు ఛార్లెస్.

దాదాపు పావుగంట నడిచిన అనంతరం ఒక తలుపు వచ్చింది. తెరుచుకొని లోనికి పోయారు.

కొంతదూరం పోగానే అదొక హాలు అని అర్థం అయింది నటరాజన్ కి. పైన వరాండాలా కట్టారు. వాటి మీద ప్రతి పది గజాలకొక సైనికుడి చొప్పున మెషిన్ గన్స్ తో కాపలా కాస్తున్నారు.

హాలు మధ్యలో రకరకాల యంత్రాలు, కంప్యూటర్లు వున్నాయి. ఆపాదమస్తకం తెల్లటి మాస్కులు ధరించిన వ్యక్తులు పనిచేస్తున్నారు. నిశ్శబ్దంగా వుంది.

పైనుంచి మెట్లున్నాయి ఒక ప్రక్కగా. నటరాజన్ బృందాన్ని ఆ మెట్లమ్మట క్రిందకు దింపి హాలు మధ్య గుండా అవతలికి తీసుకుపోయారు సైనికులు. ఒక తలుపు తెరిచి లోపలకు పంపారు. లోపల ఎర్రటి లైటు వెలుగుతూంది.

ఒక వ్యక్తి గోడలో వున్న పలకను ప్రక్కకు లాగి, ఫోన్ లో ఏదో మాట్లాడాడు. అతను ఫోన్ పెట్టేసి, పలక మూయగానే ఒక తలుపు పైకి పోయి మార్గం ఏర్పడి చిన్న నడవా ఏర్పడింది. అందులో ప్రవేశించారు.

అంతా కలలోలా వుంది కెప్టెన్ నటరాజన్ కి. ఇటువంటివి ఇంగ్లీష్ పిక్చర్లలో చూశాడు తాను. కాని జీవితంలో చూస్తానని అనుకోలేదు.

నడవా చివర తలుపు వుంది. తలుపు తెరిచి వారిని లోనికి ప్రవేశపెట్టాడు ఒక సైనికుడు. మిగిలిన సైనికులు బయటే ఆగిపోయారు.

లోపల అధునాతనమైన గది ఒకటి వుంది. గది అనే కంటే హాలు అనటం సమంజసం. ఒక చివర టేబులు, దానిమీద రకరకాల ఫైళ్ళు, దాని ప్రక్కనే మరో డయాస్ వుంది. దానిమీద రకరకాల మీటలు, యంత్రాలు

ఉన్నాయి. గోడమీద నాలుగు టెలివిజన్ స్క్రీన్లున్నాయి. వాటి ద్వారా ఎక్కడేమి జరుగుతూంది తెల్సుకోవచ్చు.

టేబుల్ అవతల రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని ఉన్నాడొక వ్యక్తి.

5

"ఐయామ్ ది జనరల్."

ఆ మాటల్లో గర్వం, అహంకంటె వ్యంగ్యం, హేళన తొంగిచూశాయి. కెప్టెన్ నటరాజన్ అతనివైపు పరిశీలనగా చూశాడు.

లావుగా, దృఢంగా ఉన్నాడు జనరల్. బుర్ర మీసాలు, మిలిటరీ దుస్తులు ధరించటంవల్ల హుందాతనం అబ్బింది. పెదాలు సాగదీసి నవ్వుతుంటే వళ్ళు ఝల్లుమంటుంది.

"నా పేరు నటరాజన్. కెప్టెన్‌ని!" తనని తాను పరిచయం చేసుకున్నాడు ఇంగ్లీషులో.

"గ్లాడ్ టు మీట్ యు మిస్టర్ కెప్టెన్!" నవ్వుతూ అన్నాడు జనరల్. "మిమ్మల్ని చంపకుండా ఇక్కడి కెందుకు తెచ్చానో ఊహించగలరా?"

"మీ నాయకుల ఆజ్ఞ అయివుంటుంది. మమ్మల్ని బందీ చేసి భారతదేశంమీద నిందారోపణ వేయటానికి తగిన సమయం యిది."

జనరల్ కళ్ళు పెద్దవయాయి. "డామిట్! యు ఆర్ వెరీ ఇంటలిజెంట్" అన్నాడు అభినందనపూర్వకంగా.

కాని అంతలోనే ఛాలెన్స్ కల్పించుకున్నాడు. "సారీ! జనరల్ అయిడియా బాగానే ఉంది కాని, అది నెరవేరనందుకు నేను చింతిస్తున్నాను."

జనరల్‌తో పాటు మిగిలినవారు కూడా ఆశ్చర్యంతో ఛార్లెస్ వంక తిరిగారు.

"ఎందుకు నెరవేరదు? ఇప్పుడు మీరు మా ఖైదీలు. ఈ దెబ్బతో ప్రపంచ రాజ్యాలన్నీ మిమ్మల్ని దుమ్మెత్తి పోస్తాయి. భారతదేశం మామీదికి దాడికి వచ్చిందని ఋజువుచేస్తాం. అంతర్జాతీయంగా మీ పేరుప్రతిష్ఠలు ఏమవుతాయో చూద్దురుగాని!"

"అంతవరకు మేమేం చేయాలి?" ఛార్లెస్ అడిగాడు.

"మీరు మా ఖైదీలు. మా స్థావరాన్ని చూశారు. ఇంతవరకూ ఎవ్వరూ మా బేస్‌ని ట్రేస్ చేయలేక పోయారు ఏ దీవిమీద ఉందో. అండర్ గ్రౌండ్ నుండి రాకెట్స్ ప్రయోగించి మేమనుకున్న స్థావరాన్ని నాశనం చేయగలం. ప్రయోగానికి అన్నీ సిద్ధం అయిపోయాయి. మరో వారం రోజుల్లో ప్రయోగించబోతున్నాం. తొలి బాంబ్ ఉన్న రాకెట్టు పడేదెక్కడో తెల్సా? న్యూఢిల్లీ మీద!" పెద్దగా నవ్వుతూ అన్నాడు జనరల్ వెనక్కి తిరిగి టేబుల్ వద్దకు నడుస్తూ.

ఎగిరి అతనిమీద పడి బుర్ర పగలగొట్టాలనిపించింది నటరాజన్‌కి. కాని జనరల్ చటుక్కున వెనక్కి తిరిగాడు. అతి కష్టంమీద తనను తాను తమాయించుకున్నాడు నటరాజన్. ఛార్లెస్ మౌనంగా ఉండి పోయాడు.

"గుడ్‌లక్ మై ఫ్రెండ్స్! మిమ్మల్ని బంధించబోతున్నాను. ఏ విధమైన పిచ్చిపనులూ చేయవద్దు. ఈ బేస్‌లో ప్రతి అడుక్కీ టెలివిజన్ కెమెరాలు అమర్చబడివున్నాయి."

వెనక తలుపు తెరుచుకొని యిద్దరు సైనికులు ప్రవేశించారు. జనరల్ గదికే మరో తలుపు వుంది ప్రక్కగా. దాని ద్వారా ముందుకు వెళ్ళారు. అది చిన్న నడవాలా వుంది. దానికి అటూ యిటూ కాబిన్స్‌లా గదులున్నాయి. అటు అయిదు, ఇటు అయిదు, మొత్తం పదిగదులు. కెప్టెన్ నటరాజన్ బృందాన్ని మూడు భాగాలుగా విభజించి, మూడు ప్రక్క ప్రక్క కాబిన్స్‌లో బంధించారు.

6

సెల్‌లో బంధించబడగానే ఛార్లెస్ చేసిన మొదటి పని, లోపల ఎక్కడయినా మైక్రోఫోన్స్‌గాని, టెలివిజన్ కెమెరాలు గాని వున్నాయేమోనని పరీక్షించడం. అతని అదృష్టంకొద్దీ అటువంటివేమీ ఏర్పాటు చేయబడి వుండలేదు. అయినా ఛార్లెస్‌కి అనుమానంగానే వుంది ఎక్కడో అమర్చబడి ఉండకపోవని.

కెప్టెన్ నటరాజన్ పచార్లు ఆరంభించాడు, ఛార్లెస్ పరీక్షిస్తూంటె.

ఆ సెల్ పూర్తిగా యినుముతో చేయబడ్డట్లుంది. చాలా పైభాగాన చిన్న వెంటిలేటర్ తప్ప మూడో మార్గం లేదు. ఆ వెంటిలేటర్‌కి అయినా ఐరన్ మెష్ అడ్డుగా వుంది. అది ఎయిర్‌ని క్లియర్ చేసేందుకు ఉపయోగిస్తారని భావించాడు ఛార్లెస్. అంటే అండర్ గ్రౌండ్‌లో ఆ సెల్స్ నిర్మించబడి ఉండటంవల్ల తాము పీల్చి వదిలేగాలి బయటికి పోలేదు. దానిలోనుంచి కార్బన్ డయాక్సైడ్‌ను తీసివేసి, శుభ్రపరిచి మరల మంచి గాలిని ఆ గదిలోకి వదులుతారు. ఇదంతా యంత్రాలద్వారా జరుగుతూంది.

కెప్టెన్ నటరాజన్ పచార్లు ఆపి, ఒక మూలగా వున్న

సోఫామీద కూర్చున్నాడు. సీలింగ్ పైన అమర్చబడిన లైటువల్ల ఆ గదిలో కాంతి ప్రసరిస్తోంది. ఒక్క క్షణం కరెంటు ఆగితే అండర్ గ్రౌండ్ వ్యవహారాలన్నీ తల క్రిందు లవుతాయి. ఈ ఆలోచన రాగానే వులిక్కిపడ్డాడు నటరాజన్.

తాము కరెంటును ఆపివేస్తే? ఈ బేస్ అంతా ఛిన్నాభిన్నమవుతుంది. ఎక్కడి కార్యక్రమాలు అక్కడ ఆగిపోతాయి. గాలి ఆడక చనిపోతారు. అఫ్‌కోర్స్! తాము మరణించక తప్పదు. కాని తాము అన్నిటికీ సిద్ధపడే వచ్చారు. ఈ రాకెట్ ప్రయోగాన్ని ఆపాలి. ఆపాలంటె తాము తప్పించుకోవాలి? కాని ఎలా?

ఆలోచనలతో మెదడు వేడెక్కింది. నటరాజన్ తనకు వచ్చిన అనుమానాన్ని బయట పెట్టాడు.

"ఇంత అట్టహాసంగా, భద్రంగా వున్న ఈ అండర్ గ్రౌండ్‌లో కరెంటు ఆగిపోతే వాళ్ళు ఊరుకుంటారను కోను! దానికి విరుగుడుగా జనరేటర్స్ వున్నాయి కదా!" అన్నాడు ఛార్లెస్, నటరాజన్ అనుమానాన్ని విని.

"అదీ నిజమే! కాని వాటినికూడా నాశనం చేయాలి!" అన్నాడు పట్టుదలగా కెప్టెన్ నటరాజన్.

"ఇంపాజిబుల్ కెప్టెన్! మన శత్రువులు చాలా గట్టి వాళ్ళు. వారి మధ్య సరయిన దోవ తెలియకుండా సంచరించటం ఎంత ప్రమాదకరమో ఆలోచించారా?"

"అవును. అన్నీ ఆలోచించాను. అందుకే నా ప్లాన్ వినండి. మనం యిక్కడినుండి తప్పించుకొని జనరల్ రూంకి చేరుకుంటాం. అక్కడ ఈ బేస్‌కి సంబంధించిన మ్యాప్స్, ఇతర వివరాలు వుంటాయి. వాటిని స్వాధీన

పరుచుకొని ఈ బేస్ మొత్తాన్ని నాశనం చేయాలి!''

''సారీ కెప్టెన్! ఇది అనుకున్నంత తేలిక గాదు.''

కెప్టెన్ నటరాజన్ ఛార్లెస్ వైపు కోపంగా చూశాడు.

''ఐయామ్ ది కెప్టెన్'' అన్నాడు నటరాజన్.

ఛార్లెస్ మాట్లాడలేదు. ఇంతలో డోర్ తెరుస్తున్నట్లు చప్పుడు అయింది. అందరూ తలుపువైపు చూస్తూ నిలబడ్డారు.

తలుపు తెరుచుకొని ఇద్దరు సైనికులు లోనికి ప్రవేశించారు. ఇద్దరి చేతులలోను మెషిన్‌గన్స్ వున్నాయి రెడీగా. వారి వెనుక యిద్దరు బట్లర్‌లు వచ్చి ట్రేలో ఆహార పదార్థాలు తెచ్చి టీపాయ్‌మీద పెట్టారు. తినమన్నట్లు సైగచేశారు సైనికులు. బట్లర్‌లతో పాటు బయటికి వెళ్ళిపోయారు.

నటరాజన్ బృందం పదార్థాలన్నీ ఖాళీ చేశారు. సరిగ్గా పావుగంట తర్వాత తలుపు తెరుచుకొని బట్లర్‌లు లోనికి వచ్చి ట్రేలను తీసుకుపోయారు. కెప్టెన్ నటరాజన్ సోఫాలో కూలబడ్డాడు.

7

ఏ గొడవా లేకుండా ఒకరోజు గడిచిపోయింది.

ఆ రోజు జనరల్ వచ్చి చెప్పాడు, కెప్టెన్ బృందాన్ని తమ నేరానికి స్పెషల్ ప్లేన్‌లో తరలిస్తున్నారని.

కెప్టెన్ నటరాజన్ అదిరిపోయాడు. అక్కడకు చేరుకుంటే బయటపడటం కల్ల.

''మమ్మల్ని ఎప్పుడు తీసుకెళతారు?'' సిబ్బందిలో ఒకరడిగారు.

అతనివంక చూసి నవ్వాడు జనరల్. ''రేపు ఉదయం'' అలా అని వెళ్ళిపోయాడు.

'రేపు ఉదయం' అనుకున్నాడు నటరాజన్. అంటే యింకా ఇరవై నాలుగు గంటల సమయం వుంది. ఈ లోపలే తాము త్వరపడాలి.

మధ్యాహ్న భోజనం సమయంలో డోర్‌కి అటొకరు, యిటొకరు నిలబడ్డారు చార్లెస్, నటరాజన్‌లు. తలుపు తెరుచుకొని సైనికులు లోనికి రాగానే చేయి విసిరి నోరు మూసి కడుపులో గుద్ది క్రింద పడేశారు. బట్లర్‌లు కొయ్యబారిపోయారు. అయిదు నిమిషాలలో నలుగురూ స్పృహ తప్పి పోయారు.

చార్లెస్, నటరాజన్‌లు క్రిందపడ్డ మెషిన్‌గన్స్‌ని చెరొకటి తీసుకున్నారు. మెల్లగా తలుపు తెరిచి తల బయటపెట్టి చూశాడు చార్లెస్. ప్రక్క గదిలోని సైనికులు బయటకు వచ్చారు. నటరాజన్ గదిలోంచి ఇంకా సైనికులు బయటకు రాకపోవడంతో అనుమానం ఉదయించింది.

జరగబోయేది గ్రహించాడు చార్లెస్. చటుక్కున బయటికి ఉరికి నేలమీద పడుకొని మెషిన్‌గన్ ఫైర్ చేశాడు. నలుగురు కేకలువేస్తూ పడిపోయారు. క్షణాల్లో జరిగిపోయింది యిది. ప్రక్క గదిలోంచి నటరాజన్ అనుచరులు, బట్లర్‌లను స్పృహ తప్పించి బయటకు వచ్చారు.

అందరూ తలా ఒక మెషిన్‌గన్ తీసుకున్నారు. చార్లెస్ ఆగమన్నట్లు సైగ చేశాడు. రెండు నిమిషాలు వేచి చూశారు తమ కాల్పులు ఎవరికయినా విన్పించాయేమోనని. జనరల్‌కు విన్పించే అవకాశం లేదు. ఎందుకంటే అది సౌండ్‌ప్రూఫ్ గది అని గ్రహించాడు చార్లెస్.

అందరూ నెమ్మదిగా తలుపు దగ్గరకు నడిచారు. ఓరగా

తలుపులు వేసి వున్నాయి. కొద్దిగా నెట్టి చూశాడు. లోపల జనరల్ డయాస్ మీద కూర్చొని ఏదో చూస్తు న్నాడు టెలివిజన్‌లో. అప్పుడప్పుడు ఏవేవో మీటలు నొక్కుతున్నాడు. అయిదు నిమిషాలు గడిచిపోయాయి అలానే. ఎందుకో లేచాడు జనరల్.

అంతకంటే మరో అవకాశం రాదు. తలుపు ధడాలున తెర్చుకొని లోనికి అడుగుపెట్టటం, జనరల్ మీదికి గురి చూసి ఫైర్ చేయటం సెకన్లలో జరిగిపోయింది. బుల్లెట్లు నుదుటిమీద తగిలాయి. ఆశ్చర్యంగానే కూలిపోయాడు జనరల్.

బిలబిలమంటూ నటరాజన్ అనుచరులు లోనికి ప్రవే శించారు.

"ఏ స్విచ్ నొక్కవద్దు. మనం యిక్కణ్నుంచి బయట పడాలి ముందు. జాగ్రత్తగా మసలండి" హెచ్చరించాడు చార్లెస్.

కెప్టెన్ నటరాజన్‌తోపాటు తానూ డయాస్ దగ్గరకు నడిచాడు.

దానిమీద పదివరకు చిన్న టెలివిజన్ స్క్రీన్ లున్నాయి. వాటిల్లోనుండి రాకెట్ ప్రయోగ కేంద్రం కన్పిస్తోంది వివిధ కోణాలలో.

"ఈ బేస్‌ని నాశనం చేయాలి త్వరగా!" ఆత్రుత పడుతూ అన్నాడు కెప్టెన్ నటరాజన్. డయాస్‌మీద కొన్ని మీటలున్నాయి రంగురంగులుగా. ఎర్రగా ఉన్న వాటి క్రింద డేంజర్ అని ఇంగ్లీషులో వ్రాసి ఉంది.

ఏదో చెప్పబోయాడు ఛార్లెస్. ఇంతలో తాము వచ్చిన ద్వారంకాక, రెండో ద్వారం పైన ఎర్రటి బల్బు వెలిగి

ఆరిపోసాగింది. అంటే ఎవరో లోనికి రావటానికి అనుమతి కోరుతున్నారన్నమాట.

నటరాజన్ బుర్ర చురుగ్గా పనిచేసింది. కుర్చీలో పడి వున్న జనరల్ శవాన్ని క్రిందికి లాగి డయాస్ అవలివైపు పడుకోపెట్టాడు. గుమ్మానికి ఒక మూలగా డయాస్ ఉండటంవల్ల దానికి అడుగున పడివున్న జనరల్ శవం కన్పించదు గుమ్మంలోనుండి చూస్తే.

చకచక చార్లెస్‌కు, అనుచరులకు చెప్పాడు ఏమి చేయాల్సింది.

చార్లెస్‌తోపాటు అనుచరులు అటూ యిటూ గుమ్మానికి గోడకి ఆనుకొని గన్స్ పొజిషన్‌లో ఉంచుకొని నిలబడ్డారు. నటరాజన్ కుర్చీలో కూర్చున్నాడు. డయాస్ మీటలు ఇంగ్లీషులో ఉండటంవల్ల డోర్ తెరిచే మీటను నొక్కడం సులభం అయింది. నొక్కి గుమ్మానికి వీపు వుండేలా తిరిగి కూర్చున్నాడు.

తలుపు తెరుచుకొని ముగ్గురు వ్యక్తులు లోనికి ప్రవేశించారు. ముగ్గురూ మిలటరీ దుస్తులలో వున్నారు. రెండు అడుగులు ముందుకు వేశారు. వారి వెనక నడుం దగ్గర ఏదో గుచ్చుకున్నట్లయింది.

"హేండ్సప్! డోంట్ మూవ్!" అన్నాడు ఛార్లెస్. కెప్టెన్ నటరాజన్ వారికి తన ముఖం చూపించాడు. షాక్ తగిలినట్లు అదిరిపడ్డారు ఆ ముగ్గురు.

ముగ్గురుని ముందుకు నడవమని ఆజ్ఞాపించాడు చార్లెస్. నడుస్తున్నారు వారు. నటరాజన్ కూడా తన గన్ తీసుకొని డయాస్ ముందుకు వచ్చాడు. ఉన్నట్లుండి ఒకడు ఎగిరి డయాస్ మీదకు దూకాడు. మెషిన్ గన్స్ గర్జిం

చాయి. ముగ్గురూ కూలిపోయారు. కాని అప్పటికే జరగ వలసిన ప్రమాదం జరిగిపోయింది.

"క్విక్! పరుగెత్తండి!" అరిచాడు నటరాజన్. అందరూ తలుపుదగ్గరకు పరుగెత్తి బయటపడ్డారు. బయట హాడా విడిగా, గోలగా వుంది. చెవులు గింగుర్లెత్తేట్టు మోగుతూంది అలారమ్. మెషిన్‌గన్స్ పట్టుకున్న సైనికులు పరుగెత్తు కుంటూ వస్తున్నారు.

హాలులో ప్రవేశించారు. అప్పటికి నటరాజన్ బృందాన్ని గుర్తించారు సైనికులు. మెషిన్‌గన్ పొజిషన్‌లో వుంచి కాల్చబోయారు. కాని...ఎగిరి అవతలపడ్డారు. ఎక్క ణ్ణుంచి పడిందో హేండ్ గ్రెనేడ్ కాబోలు, పెద్ద విస్ఫో టంతో పేలింది. చెల్లాచెదురయ్యారంతా.

సైనికులతో కల్సిపోయారు వర్కర్సుకూడా. అంతా పొగ. కళ్ళకు ఏమీ కన్పించడంలేదు.

"క్విక్! మూవ్ ఆన్!" చార్లెస్ గొంతు విని అయో మయంగా అనుసరించారు నటరాజన్ బృందం.

మెట్లద్వారా పైకి చేరుతున్నారు. మెషిన్‌గన్స్ పేలు తున్నాయి. గుడ్డిగా ఆ పొగలోకి పేలుస్తున్నారు సైని కులు, ఆ గుండ్లకి వారి సైనికులే చనిపోతారని తెలిసి కూడా.

పరుగెడుతున్నారు చార్లెస్ బృందం. మరో గ్రెనేడ్ వెనకవారిపై పడి పేలింది. దద్దరిల్లింది ఆ ప్రదేశం అంతా. అండర్‌గ్రౌండ్ కూలిపోతుందేమో అన్పించింది కెప్టెన్ నటరాజన్‌కి. తలుపు తెరుచుకొని సొరంగంలో ప్రవే శించారు.

"క్విక్! క్రిందకు జారిపడండి!" అరిచాడు చార్లెస్.

అందరూ అలానే చేశారు. సొరంగంలో అవతలివేపు నుంచి తలుపులు తెరుచుకొని సైనికులు వస్తూ కాల్పులు సాగిస్తున్నారు. చార్లెస్ అనుచరుల చేతిలో మెషిన్‌గన్స్ మోగాయి. కొంతమంది కూలిపోయారు. లేచి ముందుకు పరుగెట్టాడు చార్లెస్. క్రిందపడి కాల్చడానికి రెడీ అవుతున్న మిగిలిన సైనికులు ఏం జరిగిందో తెల్సుకునే లోపల ఛార్లెస్ కురిపించిన అగ్నివర్షానికి బలయిపోయారు.

ముందుకు పరుగెత్తారు అంతా. వెనకనుంచి గుండ్లు తరుముతున్నాయి. ఛార్లెస్ బృందంలో యిద్దరు పడిపోయారు. అయినా ఆగలేదు. రివ్వున పోయి లిఫ్ట్‌లోకి ఎక్కారు.

లిఫ్ట్ కొంత పైకిపోగానే క్రింద సైనికులు ప్రవేశించారు. గన్స్ పైకి పెట్టి ప్రేల్చసాగారు. అప్పుడు చూశాడు నటరాజన్ చార్లెస్‌ని.

తన చొక్కాకున్న ఒక గుండీని తెంపి బోను సందులో గుండా సైనికులమధ్య పడేటట్లు విసిరాడు చార్లెస్. పేలింది అది. సైనికులు పడిపోయారు.

ఆశ్చర్యంతో చార్లెస్ వంక చూస్తూండిపోయాడు నటరాజన్. చార్లెస్ అతనివంక చూసి నవ్వి ఊరుకున్నాడు.

కొండరాయిని తప్పించి బయటకువచ్చారు చార్లెస్ బృందం. ఆకాశంవైపు చూశాడు. దూరంగా ఏవో నలుసుల్లా కన్పించాయి.

"గుడ్!" అన్నాడు చార్లెస్.

"ఏమిటి?" అన్నాడు కెప్టెన్ నటరాజన్.

"సారీ కెప్టెన్! మీకు అంతా తెలియచెపుతాను. ముందు మనం యిక్కణ్నుంచి వెళ్దాం రండి" అని

ముందుకు అడుగువేసి ఆగిపోయాడు చార్లెస్. ఏదో గుర్తొచ్చింది కాబోలు, వెనక్కి తిరిగి లిఫ్టువున్న గదిలోకి వెళ్ళాడు.

పదినిముషాల అనంతరం తిరిగివచ్చాడు.

"లిఫ్ట్ పనికిరాకుండా చేశాను!" అన్నాడు. అతని చొక్కాకున్న గుండీలలో ఇంకా రెండు మిగిలివున్నాయి.

అందరూ అడవివైపు బయలుదేరారు. అదే సమయంలో ఆ దీవినుంచి జట్ ఫైటర్స్ బయలుదేరాయి.

"భయంకర యుద్ధం జరగబోతోంది!" అన్నాడు చార్లెస్. దూరంగా వస్తున్న విమానాలు దగ్గరయ్యాయి.

"మనం సురక్షిత స్థలానికి చేరుకోవాలి. పదండి!" అంటూ దారితీశాడు. సముద్రపు పాయదగ్గర గోయి తీసి అందరు బోర్లాగ చెవుల్లో చేతులుపెట్టుకొని పడుకున్నారు.

ఆకాశంలో యుద్ధం ప్రారంభమయింది విమానాల మధ్య.

రివ్వున దూసుకొస్తున్నాయి బాంబర్లు. కూలిపోతున్నాయి కొన్ని విమానాలు. మండిపోతున్నాయి. నాశనం అయిపోతున్నాయి. కొన్ని దీవిమీదకు దూసుకువచ్చాయి. దీవి దద్దరిల్లింది వాటి బాంబులతో. సముద్రంలో మునిగిపోతుందా అన్పించింది. మరికొన్ని బాంబులను వేసి వెళ్ళాయి. అది చాలు. దీవిలో వున్న అండర్‌గ్రౌండ్ ఎక్స్‌ప్లొజివ్స్ అంటుకున్నాయి. పెద్దపెద్ద ప్రేలుళ్ళతో దీవి అదిరిపోతోంది.

చెవులు పగిలిపోతాయేమో నన్పించింది చార్లెస్ బృందానికి. ఆకాశంలో విమానాల యుద్ధం సాగుతోంది.

దీవినుంచి బయలుదేరిన చాలా ఫైటర్లు కూలిపోయాయి.

దీవి మండిపోతోంది. ప్రేలుళ్ళవల్ల అంటుకున్న వస్తువులు ఎగిరి అడవులమీద పడుతున్నాయి. చెట్లు కూడా మండుతున్నాయి.

చార్లెస్ టైం చూసి అతి కష్టంమీద లేచిచూశాడు. సముద్రపు పాయలో గుండా ఒక బోటు వస్తూంది.

ఆనందంతో నటరాజన్‌ని హెచ్చరించాడు. మరుక్షణం అతని బృందం బోట్ మీద ఉంది. క్షణంలో బోట్ పైన డోమ్‌లా ఏర్పడసాగింది.

"ఇది మినీ సబ్-మెరీన్!" చెప్పాడు చార్లెస్.

"భారతదేశం జలరక్షక అనే నౌకను ఏర్పాటు చేసిందనగానే శత్రుదేశాలు దాన్ని రూపుమాపటానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ వార్తలన్నీ భారత ప్రభుత్వానికి తెలుస్తూనే ఉంది. అందుకే ముందుజాగ్రత్తకోసం సీక్రెట్ బ్రాంచ్ ఏజంటునయిన నన్ను వైర్‌లెస్ ఆపరేటర్‌గా నియుక్తుణ్ణి గావించింది. జలరక్షకలోని సంగతులు ఎప్పటికప్పుడు పంపాలి. కాని జలరక్షకని ముంచినాయి శత్రుదేశాలు. తలవని తలంపుగా మనం చిక్కుకుపోవటం జరిగింది.

నా షర్టుకున్న గుండీలు ప్రత్యేకంగా తయారుచేసిన మినీ బాంబులు. అంతేగాక నా కాలర్ దగ్గర ఎముకవద్ద ఒక శక్తివంతమైన ట్రాన్స్‌మిటర్‌ని శరీరంలో ఉంచి కుట్టేశారు. నేను మాట తిప్పి ఎంత చిన్నగా మాట్లాడినా దాని ద్వారా అవతలివాళ్ళకు విన్పిస్తూంది.

నేను నా ప్లాను అంతా వివరించాను. అంతా అను

ఉన్నట్లే జరిగింది. సమయానికి సబ్-మెరీన్‌లో వచ్చి మనల్ని కాపాడారు.''

చెప్పటం ముగించాడు ఛార్లెస్.

ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు కెప్టెన్ నటరాజన్ బృందం.

'జలరక్షక ప్రతీకారం తీర్చుకుంది!' అనుకున్నాడు కెప్టెన్ నటరాజన్.

—: ఐపోయింది :—